సాక్షి జనగామ

సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



పాలనపై ప్రతికూల ప్రభావం!

కేయూలో అధ్యాపకుల కొరతతో యూనివర్సిటీ పాలనపై ప్రతికూల ప్రభావం పడుతోంది. అయినా అధికారులకు పట్టింపులేదని యూనివర్సిటీలో చర్చ జరుగుతోంది. - 8లో



నేటి నుంచి 'పది' మూల్యాంకనం

పదోతరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం నేటి నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. - 8లో

గరిష్టం/కనిష్టం
38^0 /24^0

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగా ఉంటుంది.



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



లింగాలఘణపురం: నవాబుపేటలో తలంబ్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామ:నగరేశ్వరవాసవీ కన్యకాపరమేశ్వరి సీతారామచంద్రస్వామి ఆలయంలో..

వల్మిడిలో కల్యాణానికి హాజరైన భక్తులు





వల్మిడిలో సీతారాముల ఉత్సవమూర్తులు

జనగామ: పాతబీటు బజారులో భక్తజన సందోహం





లింగాలఘణపురం: జీడికల్‌లో మంగళసూత్రాన్ని చూపిస్తున్న వేదపండితుడు



జనగామ:ఒడిబియ్యం పోస్తున్న మహిళా భక్తులు



స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కల్యాణం..రమణీయం

వేదపండితుల సమక్షంలో కోదండ రాముడి వివాహం | భక్తజనసంద్రంగా మారిన 'జనగామ'

నవాబుపేట, వల్మిడిలో పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యేలు కడియం, యశస్వినిరెడ్డి

జనగామ: వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణం ఆదివారం జిల్లా వ్యాప్తంగా కనుల పండువగా జరిగింది. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య సీతారాముడి వివాహ వేడుకలు అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాలతో పాటు పట్టణంలోని పాతబీటు బజార్‌లో 72వ ఏట శ్రీ రాముడి పట్టాభిషేకం, కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మహిళలు సీతమ్మ తల్లికి ఒడి బియ్యం పోసి, పట్టు వస్త్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ, మూలబావి శ్రీ హనుమత్ రామనాథ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకుడు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ మోహనకృష్ణ భార్గవ ఆధ్వర్యంలో రామనవమి వేడుకలు నిర్వహించారు. సాయంకాలం ఉత్సవ మూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. నవాబుపేటలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి మండలం వల్మిడి పుణ్యక్షేత్రంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి కల్యాణం వీక్షించారు.

- మరిన్ని ఫొటోలు 9లో

న్యూస్‌రీల్

అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలి



జనగామ రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద నిర్మాణం జరుగుతున్న బైపాస్ రోడ్‌లో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించి ప్రజలకు మేలు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బాణాపురం దీక్ష శిబిరం నుంచి పాదయాత్ర కలెక్టరేట్ వరకు పాదయాత్ర, కలెక్టర్ కార్యాలయం ఎదుట మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 69వ రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా.. అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. కాగా ఆదివారం దీక్షలను ఐద్వా పట్టణ నాయకురాలు బూడిద వాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చీర రజిత, తాళ్లపల్లి అనిత, ఆకుల మంజుల, తదితరులు పాల్గొన్నారు

రణదివే స్ఫూర్తితో ఉద్యమించాలి



జనగామ రూరల్: కామ్రేడ్ బీటీఆర్ రణదివే స్ఫూర్తితో కార్మికులు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో రణదివే 35వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కోశాధికారి అన్నబోయిన రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రామిక మహిళల సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో బూడిద ప్రశాంత్, గంగారబోయిన మల్లేష్ రాజ్, ఉపేందర్ శివరాత్రి రాజు, చీర శ్రీను, కనక చారి, శంకర్, మల్లేష్, మమత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలను గుర్తించిన ఇంజనీర్లు

టన్నెల్‌లోకి దిగిన మెగా సిబ్బంది



ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లోని రిజర్వాయర్ సమీపాన ఇటీవల జరిగిన టన్నెల్ లీకేజీలను ఎట్టకేలకు ఇంజనీర్లు గుర్తించారు. దేవాదుల పథకంలో భాగంగా 3వ ప్యాకేజీ కింద దేవన్నపేట పంపుహౌస్ నుంచి రిజర్వాయర్ సమీపం వరకు పైపులైన్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి సుమారు 200 మీటర్లు రిజర్వాయర్ వరకు టన్నెల్ నిర్మించారు. ఈ క్రమంలో గత నెల 27న రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేయగా వారం రోజుల క్రితం టన్నెల్ లీకేజీ అయింది. దీనితో పంపులు ఆపివేసి టన్నెల్ నుంచి నీటిని డీ వాటరింగ్ చేశారు. ఈ క్రమంలో ఆదివారం పైపు నుంచి టన్నెల్‌లోకి దిగిన మెగా ఇంజనీర్లు, సిబ్బంది లీకేజీలను కనుక్కొని మరమ్మతులు ఎలా చేయాలో పరిశీలించారు.

'ఉపాధి' కూలీలకు చేయూత

- రోజువారీ వేతనం రూ.300 నుంచి రూ.307కు పెంపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఈనెల నుంచి అమలు
- జిల్లాలో 2.31 లక్షల కూలీలకు లబ్ధి



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జనగామ రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు కనీస వేతనం పెంచుతూ కేంద్రం తీపి కబురు అందించింది. 2024–25 ఆర్థిక సంవత్సరం ఉపాధి కూలీలకు వేతనం రూ.300 చెల్లించగా.. ప్రస్తుతం రూ.7 పెంచడంతో జిల్లాలోని 2.31 లక్షల మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. ఉపాధి హామీ పథకం ప్రారంభంలో 2005 అక్టోబర్ 2న కనీస వేతనం రూ.87.50 ఉంది. 2006 నుంచి చట్టంగా మారి దేశవ్యాప్తంగా అమలైంది. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసరాల ధరలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కనీస వేతనం పెంచింది.

ఉపాధిలో చేపట్టే పనులు

జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా జల వనరుల సంరక్షణ, నర్సరీల నిర్వహణ, మొక్కలు నాటడం, సంరక్షణ, పంట పొలాలకు మట్టి కట్టలు, పొలాలకు వెళ్లేందుకు మట్టిరోడ్లతోపాటు వివిధ అభివృద్ధి పనులు కల్పిస్తున్నారు. చేపట్టిన పనుల కొలతల ఆధారంగా కూలీలకు వేతనం చెల్లిస్తారు.

కొత్త పనులు ప్రారంభం

ఉపాధి హామీ కూలీలకు పెంచిన వేతనం ఈ నెల మొదటి వారం నుంచి అమలు కానుంది. అలాగే 2025–26 ఆర్థిక సంవత్సరం నూతన పనులు ప్రారంభం కానున్నాయి. మండుతున్న ఎండల దృష్ట్యా ఉదయం సమయంలోనే పనులు పూర్తి చేసుకునేలా సంబంధిత అధికారులు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. పని ప్రదేశాల్లో కూలీలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

పెరుగుతున్న కూలీల సంఖ్య

ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలో నిత్యం 18వేలకు పైగా కూలీలు పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ పనులు పూర్తి కావస్తున్నాయి. మే ప్రారంభం నాటికి రోజువారీ కూలీలు 70 వేలకు పెరిగే అవకాశం ఉంది. వేసవిలో ఇతర ఏ పనులు ఉండకపోవడం.. అలాగే భూమి లేని నిరుపేదలకు ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి ఏడాదికి కనీసం 20 రోజుల పనిచేసి ఉన్న వారికి రూ.12 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుండటంతో ఈసారి కూలీలు పెరగనున్నారు. ప్రతి కూలీకి 100 రోజులు పని కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు

జాబ్‌కార్డులు :	1,18,000
కూలీలు :	2,31,000
ఆక్టివ్ జాబ్‌కార్డులు :	77,000
ఆక్టివ్ కూలీలు :	1,26,000
రోజువారీ సగటు కూలి :	రూ.222.67

కూలి రేటు పెంచడం శుభపరిణామం



"కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజువారీ గతంలో చెల్లించిన రూ.300 వేతనానికి అదనంగా రూ.7 పెంచింది. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల దృష్ట్యా కూలి రేటు పెంచడం శుభపరినామం. వ్యవసాయ పనులు పూర్తయితే ఉపాధి పనుల్లో వేగం పెరిగే అవకాశం ఉంది. మే మొదటి వారంలో కూలీలు అధిక సంఖ్యలో పనులకు రానున్నారు.

- వసంత, డీఆర్‌డీఓ

పేదల అభివృద్ధే లక్ష్యం

- మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్



సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న శివరాజ్

జనగామ రూరల్: పేదల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. ఆదివారం జనగామ మండలం శామీర్‌పేట గోపరాజుపల్లి గ్రామాల్లో ప్రజా పాలనలో భాగంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సన్న బియ్యంను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గణిపాక మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు, జిల్లా నాయకుడు బడికే కృష్ణస్వామి, సేవాదళ్ నాయకులు సాదం మధుసూదన్, దాసరి శేఖర్, తోటపల్లి రాజిరెడ్డి, కడకంచి కొమురయ్య, ఏఎంసీ డైరెక్టర్ నామాల శ్రీనివాస్, నర్సింగరావు, వెంకట్రామ్ రెడ్డి, వెంకట్, కనకరాజు, రంజిత్, నేతాజీ, నవీన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలి

- సీజీఆర్‌ఎఫ్–1 వరంగల్ చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి

దేవరుప్పుల/లింగాలఘణపురం: విద్యుత్ సమస్యల పరిష్కారానికి నేడు లింగాలఘణపురం విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న లోకల్ కోర్టు విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్–1 వరంగల్ చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ లోకల్ కోర్టులో లింగాలఘణపురం, దేవరుప్పుల మండలాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చటం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, వాడకాన్ని హెచ్చుతగ్గుదల మొత్తంతో గల బిల్లులు, కేటగిరీ మార్పు, సర్వీస్ రద్దు మొదలగు వాటికి సంబంధించి విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించవచ్చన్నారు. ఈ ఫిర్యాదులు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ వేదికకు టెక్నికల్ విభాగం సభ్యులు కె.రమేష్, ఫైనాన్స్ మెంబర్, ఆర్.చరణ్‌దాస్, ఇండిపెండెంట్ మెంబర్ ఎం రామారావు, మండలాల అధికారులు రానున్నందున వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

- జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్



జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు రమేశ్

జనగామ రూరల్: దేశంలో బీజేపీ పాలనతో సుస్థిర అభివృద్ధి సాధ్యమని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. ఆదివారం బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు పార్లమెంటు స్థానాలు ఉన్నటువంటి దేశంలో ప్రస్తుతం అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. ప్రపంచంలో 14 కోట్ల మంది సభ్యత్వం కలిగిన ప్రపంచంలోనే ఏకైక రాజకీయ పార్టీకి బీజేపీ అన్నారు. మోదీపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. దేశంలో 370 ఆర్టికల్ రద్దు అయోధ్యలో రామ్ మందిర నిర్మాణాన్ని నిర్మించిన ఘనత నరేంద్ర మోదీకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు దశమంతరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఎల్‌ఎన్ రెడ్డి, లేగ రామ్మోహన్ రెడ్డి, ఉడుగుల రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్, పజ్జూరి లక్ష్మీ నరసయ్య, కీర్తి నర్సయ్య, డాక్టర్ బిక్షపతి, కొంతం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్రోత్సవాలు

భద్రకాళి అమ్మవారికి లక్ష పుష్పార్చన



అమ్మవారికి లిల్లీపూలతో లక్ష పుష్పార్చన

హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్ర ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా లిల్లీపూలతో అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు అమ్మవారికి పూర్ణాభిషేకం, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు లిల్లీపూలకు సంప్రోక్షణ నిర్వహించి వాటితో అమ్మవారికి లక్షపుష్పార్చన నిర్వహించారు.

భూముల అన్యాక్రాంతంపై ఫ్లెక్సీలు



తాటికొండలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండలో సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన మాన్యం భూముల అన్యాక్రాంతంపై శ్రీరామనవమి రోజున దేవస్థానం, గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద పలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నారబోయిన శ్రీనివాస్‌కల్యాణ్ పేరిట శ్రీరాముడిని పేదవాడిగా ఏమి లేనివాడిగా చేసిందెవరు.. నాయకుల లోపమా, అధికారుల లోపమా, రాముడి ఆస్తి ఎక్కడ అంటూ ప్రశ్నిస్తూ పలు ప్రదేశాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం పేరిట ఏ సర్వేనంబర్లలో ఎన్ని ఎకరాల భూమి ఉంది.. తదితర వివరాలతో ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో సదరు ఫ్లెక్సీలను చూసిన గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై శ్రీనివాస్‌కల్యాణ్‌ను సంప్రదించగా తాటికొండ సీతారామచంద్రస్వామి దేవస్థానం భూమి 86.35 ఎకరాలు ఉంటుందని, అందులో దాదాపు ఏడు ఎకరాలు అర్చకుడికి ఇవ్వగా 79 ఎకరాలు ఉండాలన్నారు. ఇందులో దాదాపు 50 ఎకరాలకు పైగా అన్యాక్రాంతం అయిందని, ఇటీవల వ్యక్తిగత పనులపై తహసీల్దార్ కార్యాలయంలో ధరణిలో చూడగా మొత్తం 79 ఎకరాలు దేవుని మాన్యం భూములుగానే చూపిస్తుందన్నారు. దేవుని పేరిట 79 ఎకరాల భూమి ఉండగా శ్రీరాముడిని పేదవాడిగా చేసి ఎందుకు చందాలు వేసి ప్రతీ ఏటా కల్యాణం నిర్వహించాల్సిన అవసరం ఏముందన్నారు. తాను వ్యక్తిగతంగా ఎవరినీ విమర్శించడం లేదని, ఈ విషయమై ప్రతిఒక్కరూ ఆలోచించాలని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

సైబర్ టవర్ల సందర్శన



సైబర్‌టవర్ల సందర్శనలో విద్యార్థినులు

కొడకండ్ల: మండలకేంద్రంలోని టీజీఆర్‌ఎస్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లోని సైబర్ టవర్లను సందర్శించారు. విశ్వ నగరమైన హైదరాబాద్ అభివృద్ధితో పాటు హైదరాబాద్ స్టాండర్డ్స్ ఆఫ్ లివింగ్‌ను విద్యార్థినులకు పరిచయం చేసేందుకు ఈ సందర్శన యాత్రను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ తెలిపారు. అలాగే మెట్రో రైలు ప్రయాణాన్ని కూడా విద్యార్థులు ఈ సందర్భంగా ఆస్వాదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు ఉన్నారు.

తాటి ముంజలొచ్చాయ్..

- పోషక విలువలు కలిగిన ప్రకృతి ప్రసాదం





పట్టణంలోని అండర్ బ్రిడ్జి ఏరియాలో ముంజల విక్రయం

జనగామ: అత్యధిక పోషక విలువలు కలిగిన తాటి ముంజల సీజన్ వచ్చేసింది. అలసట నుంచి ఉపశమనం కలిగించి ఆరోగ్యాన్నిచ్చే ముంజలంటే ప్రతిఒక్కరికీ ఇష్టమే. జిల్లాతోపాటు యాదాద్రి భువనగిరిలోని అనేక ప్రాంతాల నుంచి జనగామ పట్టణానికి తీసుకువచ్చి అండర్ రైల్వేబ్రిడ్జి, నెహ్రూపార్కు ఏరియాల్లో విక్రయిస్తున్నారు. పెరిగిన వేసవి ఎండల తీవ్రతనుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు ముంజలను కొనుగోలు చేస్తుండడంతో డిమాండ్ పెరిగింది. డజనుకు రూ.60 చొప్పున అమ్ముతున్నారు. ప్రకృతి ప్రసాదించిన ఈ ముంజలు గతంలో ఊళ్లలో ఉచితంగా లభించేవి. ఇప్పుడు ధరలు పెరిగిపోవడంతో సామాన్య, మధ్యతరగతి వర్గాలకు కాస్త భారంగా మారింది.

పోషకాలు అధికం

తాటి ముంజల్లో అనేక పోషకాలున్నాయి. ఉష్ణతాపాన్ని తట్టుకునే శక్తి ఉంటుంది. డీ హైడ్రేషన్‌కు గురికాకుండా శరీరానికి అవసరమైన నీటి శాతాన్ని అందించడంతో పాటు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడతాయి. క్యాల్షియం, మెగ్నీషియం, సోడియం, పొటాషియం, ఐరన్, సల్ఫర్, కాపర్ పుష్కలంగా ఉంటాయి. రక్తహీనతను తగ్గించడం.. మలబద్ధకాన్ని దూరం చేస్తాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో ఈ నెల 8వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి 7వ యూత్ అండర్–19 మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి పి.రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 01, 2007 నుంచి డిసెంబర్ 31, 2008 మధ్యలో జన్మించిన వారు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ బోనోఫైడ్ సర్టిఫికెట్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, రూ.300 ప్రవేశ రుసుం తీసుకుని రావాలని చెప్పారు. క్రీడాకారులు 8న ఉదయం 7గంటలకు హనుమకొండ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్ వద్ద హాజరైతే వెయింగ్ తీసుకుంటామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 11, 12వ తేదీల్లో సికింద్రాబాద్ లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9959711609 నంబర్‌లో సంప్రదించాలని రాజేందర్ పేర్కొన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు



విజేతలతో టోర్నమెంట్ నిర్వాహకులు, అతిథులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–19 చదరంగ పోటీలు సాయంత్రం ముగిశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల హాజరైన 40మంది క్రీడాకారుల మధ్య పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. ముగింపు వేడుకలకు టీటీడీ మండప మేనేజర్ రఘువీర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. బాలుర విభాగంలో రిత్విక్ గండు ప్రథమ స్థానం, సాయిజోషిత్ బొల్లం ద్వితీయ స్థానం, అక్షయ్‌కుమార్ తృతీయ స్థానం, చకిలం చరణ్‌రాజ్ నాలుగో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో తోట జాన్వీ, దీపిక బొమ్మిడిని, వర్షిత పటూరి, కైరంకొండ సహస్ర, కోమలి వరుస స్థానాల్లో విజేతలుగా నిలిచినట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి. కన్నా తెలిపారు. విజేతలు సెప్టెంబర్ 20, 21 తేదీల్లో మంచిర్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వరంగల్ జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం లభ్యం

ఖిలా వరంగల్ : వరంగల్ – కాజీపేట మధ్య శాయంపేట రైల్వే గేట్ సమీపాన రైలు నుంచి జారి పడి గుర్తు పట్టలేని స్థితిలో మృతదేహం లభ్యమైనట్లు వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ హంటర్ రోడ్డులోని శాయంపేట గేట్ సమీపాన గుర్తు తెలియని 35 నుంచి 40 ఏళ్ల వయసు గల వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. మృతుడు బ్లాక్ కలర్ ప్యాంట్, బ్లాక్ అండ్ వైట్ చెక్స్ ఫుల్ షర్ట్, పారగాన్ చప్పల్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ఆదివారం ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే 9441557232, 8712658585 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందజేయాలని రాజు కోరారు.



పాలనపై ప్రతికూల ప్రభావం!

కేయూలో పలు కీలక పోస్టులు ఖాళీ
- ఇప్పటికే మూడు డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టులు ఖాళీ
- ఈనెలాఖరులో మరో డిప్యూటీ రిజిస్ట్రార్ పోస్టు కూడా..
- ఫైనాన్స్ ఆఫీసర్ పోస్టు కూడా వెకేన్సీనే..
- అసిస్టెంట్ రిజిస్ట్రార్లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతులేవి?

కేయూ క్యాంపస్ : వరంగల్ కాకతీయ యూనివర్సిటీ.. తెలంగాణలో రెండో అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా పేరొందింది. **అంతేకాకుండా** న్యాక్ ఏప్లస్ గ్రేడ్ కలిగి ఉం**ది. ఇంత** ప్రసిద్ధిగాంచిన యూనివర్సి**టీలో** అధ్యాపకుల కొరత వేధిస్తోంది. ఫలితంగా యూనివర్సిటీ పాలనపై ప్రతికూల ప్రభావం ఉండబోతుంది. అయినా అధికారులకు పట్టింపులేదని యూనివర్సిటీలో చర్చగా ఉంది. రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులు 74శాతం ఖాళీగా ఉండగా.. మరో**వైపు** నాన్‌టీచింగ్‌లో కూడా పలు **కీలక** పోస్టులు ఖాళీగా ఉన్నాయి. **ఇప్పటికే** మూడు డిప్యూటీ రిజిస్ట్రార్ **పోస్టులు వెకే**న్సీలుగా ఉన్నాయి. దీంతో యూనివర్సిటీలో ఇబ్బందులు తప్పడం లేదు. కీలక ఫైనాన్స్ ఆఫీసర్ పోస్టు కూడా వెకేన్సీగానే ఉంది. యూనివర్సిటీలో ప్రస్తుతం ఒకే డిప్యూటీ రిజిస్ట్రార్ ఉండగా పుల్ అడిషనల్ ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా కొన్నేళ్లుగా రెండు బాధ్యతలు డిప్యూటీ రిజిస్ట్రార్ తోట రాజయ్య నిర్వర్తిస్తున్నారు.ఆ డిప్యూటీ రిజిస్ట్రార్ కూడా ఈనెలాఖరులో ఉద్యోగ విరమణ పొందబోతున్నారు.

సూపరింటెండెంట్లకు ఏఆర్‌లుగా పదోన్నతులేవి?

2021లో అప్పటి యూనివర్సిటీ అధికారులు వేకెన్సీ ఏఆర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించారు. 2022లో ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు పాలకమండలి అభ్యంతరంతో నియామకం నిలిచింది. డిప్యూటీ రిజిస్ట్రార్లుగా ఏఆర్‌లకు పదన్నోతులు కల్పిస్తే వారి స్థానంలో సూపరింటెండెంట్లకు కూడా ఏఆర్‌లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉంది. ఆ దిశగా యూనివర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాల్సింటుంది.

దీంతో ఇక డిప్యూటీ **రిజిస్ట్రార్** నాలుగు **పోస్టులతో**పాటు **ఫైనాన్స్** ఆఫీసర్ **పోస్టు** కూడా వెకేన్సీగా ఉండ**బో**తున్నాయి.

సీనియారిటీ సమస్య తేల్చరా!

కేయూలో 2017–**2018లో** అసిస్టెంట్ **రిజిస్ట్రార్ల** నియామకం **జరిగింది. అప్పట్లో** రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వలేదనే ఆరోపణలతో ఏఆర్‌ల సీనియారిటీ జాబితాపై గందర గోళం ఏర్పడింది. వీరి సీనియారిటీ నిర్ణయించేందుకు కొన్ని సంవత్సరాల క్రితం అప్పటి వీసీ సాయన్న రెండు సార్లు కమిటీలు నియమించారు. కానీ ఇప్పటి వరకు ఏఆర్‌ల సీనియారిటీని తేల్చలేకపోయారు. ఇదిలా ఉండగా తాము సీనియర్ అంటే తాము సీనియర్ అని డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పదోన్నతులు కల్పించాలనే విషయంలో పలువురు ఏఆర్‌లు కొంతకాలం క్రితం హైకోర్టును ఆశ్రయించడంతో ఈ అంశం వివాదాస్పదంగా మారింది. దీంతో ఏఆర్‌లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతలు కల్పన అంశం జాప్యం అవుతూ వస్తోంది. ప్రస్తుత వీసీ కె. ప్రతాప్‌రెడ్డి ఈ సమస్యను పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుంది.

ఒక్కొక్క ఏఆర్ రెండు మూడు చోట్ల విధులు

కేయూలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ల కొరత కూడా ఉంది. దీంతో అధికారులు పలువురు ఏఆర్‌లకు రెండు మూడు విభాగాల్లోనూ విధులు అప్పగించారు. దీంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కాగా, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ లేక ఆరునెలలు కావొస్తోంది. అక్కడి ఏఆర్ అశోక్‌బాబు సస్పెన్షన్ అయ్యాక మళ్లీ ఎవరినీ నియమించలేదు. అలాగే కేయూ హాస్టళ్ల డైరెక్టరేట్ కార్యాలయంలో కూడాఏఆర్‌గా పనిచేస్తూ కిష్టయ్య ఏసీబీకి పట్టుబడి సస్పెన్షన్ అయి 15 నెలలు గడిచాయి. అప్పటి నుంచి అక్కడ ఎవరినీ ఏఆర్‌గా నియమించలేదు. అలాగే, కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీ, ఖమ్మం పీజీసెంటర్లలో ఏఆర్, సూపరింటెండెంట్లు కూడా లేరు.

ఏఆర్‌లకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతి కల్పనేది?

కాకతీయ యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్లలో అర్హులకు డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతి కల్పించాల్సింది. అయితే ఆరేళ్లుగా పదోన్నతి కల్పించడం లేదు.దీంతో డిప్యూటీ రిజిస్ట్రార్ల పోస్టులు వెకేన్సీలుగా మిగిలిపోయాయి. కేయూలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టులు 16 మంజూరు ఉన్నాయి. రెండు వెకేన్సీలుగా ఉండగా అందులో 14మంది పనిచేస్తున్నారు. ఇందులో ఒకరు ఏసీబీకి పట్టుబడి సస్పెన్షన్‌లో ఉన్నారు. మరో అసిస్టెంట్ రిజిస్ట్రార్ తన **ఇల్లు యూనివర్సిటీ** భూమిలో



ఉండడంతో ఆయన కూడా సస్పెన్షన్‌లో ఉన్నారు. ఇంకో మహిళా ఏఆర్ స్వచ్ఛంద విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఇక 11మంది అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పనిచేస్తున్నారు.

విద్యావేత్త కాసం అంజయ్య మృతి



నివాళులర్పిస్తున్న శిష్యులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు. ఇన్‌సెట్‌లో అంజయ్య(ఫైల్)

- కేయూ మాజీ వీసీ, ప్రముఖుల నివాళి

జనగామ: ప్రముఖ విద్యావేత్త, పూర్వ లయన్ జిల్లా గవర్నర్ కాసం అంజయ్య(80) ఆదివారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు సోదరులు, ఒక కుమారుడు ఉన్నారు. అంజయ్య మరణ వార్తతో విశ్వ విద్యాలయాలు, కళాశాలల ప్రొఫెసర్లు, అధ్యాపకులు, లయన్ ప్రముఖులు అంతిమ వీడ్కోలుకు తరలివచ్చారు. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన కాసం అంజయ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వాణిజ్య శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. 1966లో వరంగల్ సీకేఎం కళాశాలలో అసిస్టెంట్ లెక్చరర్‌గా అధ్యాపక వృత్తి ప్రారంభించి.. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 1976లో లయన్స్ అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థను జనగామలో స్థాపించి వ్యవస్థాపక కార్యదర్శిగా పని చేశారు. 1989లో జిల్లా గవర్నర్ పదవి చేపట్టారు. ఆయన మార్గదర్శనంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో లయన్స్ క్లబ్‌లు విస్తరించాయి. ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న 1975 సమయంలో జనగామలో ఏర్పాటు చేసిన ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. రెండు దశాబ్దాలకు పైగా పని చేసిన ఆయన 2001లో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ పొందారు. ఆవోపా సంస్థ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి అనతి కాలంలోనే రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

అంతిమ వీడ్కోలుకు ప్రముఖులు

అంజయ్య అంతిమ వీడ్కోలుకు అనేక ప్రాంతాల నుంచి ప్రముఖులు హాజరయ్యారు. కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి, పూర్వ ఆచార్యులు టి.సుధాకర్ రెడ్డి, రమణయ్య, శంకరయ్య, పూర్వ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రుమాల్ల సునీల్ కుమార్, మల్టీపుల్ కౌన్సిల్ మాజీ చైర్మన్లు ఎం.విద్యాసాగర్‌రెడ్డి, తీగల మోహన్‌రావు, లయన్ పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు, కుందూరు వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్ ఆర్య, ఎన్.సుధాకర్‌రెడ్డి, పి.హరికిషన్ రెడ్డి, కె.గోవింద్‌రాజ్, వెంకటేశ్వరరావు, కె.సి.జాన్ బన్నీ, ముచ్చ రాజిరెడ్డి, టి.లక్ష్మీనరసింహరావు, రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రతాప్ రెడ్డి, అల్లాడి ఈశ్వర్‌రావు, ప్రభాకర్ రావు, కుర్రెముల యాదగిరి, నాగబండి రవీందర్, డాక్టర్ రాజమౌళి తదితరులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

పండగ వేళ విషాదం..

దైవదర్శనానికి వెళ్తూ విద్యార్థి దుర్మరణం
- బైక్‌ను ఢీకొన్న టాటా ఏస్
- నల్లగట్టుగుట్ట సమీపంలో ఘటన



ఉదయ్ (ఫైల్)

హసన్‌పర్తి: పండగ వేళ విషాదం చోటుచేసుకుంది. స్నేహితురాలితో కలిసి బైక్‌పై దైవదర్శనానికి వెళ్తుండగా టాటా ఏస్ ఢీకొనడంతో ఓ విద్యార్థి దుర్మరణం చెందాడు. బైక్ వెనుక కూర్చున్న విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారి హసన్‌పర్తి నల్లగట్టు గుట్ట సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం రామారావుపేటకు చెందిన రామటెంకి శ్రవణ్ కుమారుడు ఉదయ్(18) ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ చదువుతున్నారు. ప్రస్తుతం అన్నాసాగరంలో అద్దెకుంటున్నాడు.

స్నేహితురాలితో కలిసి దైవదర్శనానికి..

శ్రీరామ నవమి పండగ సందర్భంగా ఆదివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి అదే కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న రజితతో కలిసి బైక్‌పై అన్నాసాగరం నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో హసన్‌పర్తి మండల కేంద్రంలోని నల్లగట్టు గుట్ట సమీపంలో చేరగానే హనుమకొండ నుంచి ఎల్కతుర్తి వైపునకు వస్తున్న ఓ టాటా ఏస్.. బస్సును అనుసరిస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఉదయ్, రజిత తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై దేవేందర్ ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రవణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

ఇల్లందలో కారు ఢీకొని వ్యక్తి..



ఎల్లయ్య మృతదేహం

వర్ధన్నపేట: కారు ఢీకొనడంతో సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇల్లందలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లంద గ్రామానికి చెందిన సాతుపెల్లి ఎల్లయ్య(52) పాత ఇనుప సామాను కొనుగోలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం వర్ధన్నపేటలో సామాను కొనుగోలు చేసిన అనంతరం అక్కడే విక్రయించి సైకిల్‌పై తిరిగి తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లంద సమీపంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వెనుక నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న కారు అదుపు తప్పి సైకిల్‌ను ఢీకొంది. దీంతో ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సైకిల్.. కారు ముందు భాగంలోని బంపర్‌లో ఇరుక్కుపోయింది. అయినా డ్రైవర్ అదే వేగంతో ఆపకుండా వెళ్లగా కుమ్మరిగూడెం క్రాస్ వద్ద బంపర్ నుంచి సైకిల్ కిందపడింది. గ్రామస్తులు ఈ సమాచారం తమ సన్నిహితులకు అందించగా రంగశాయిపేట వాటర్ ట్యాంక్ సమీపంలో కారు ఆపగా డ్రైవర్ దిగి పరారైనట్లు స్థానికులు తెలిపారు. మృతుడి చిన్న కుమారుడు దినేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గెట్టు పైనుంచి నడుస్తూ..

- పొలంలో పడి రైతు మృతి
- బస్తారాం తండాలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన..



సిరి(ఫైల్)

నర్సింహులపేట: గెట్టు పైనుంచి నడిచి వెళ్తున్న క్రమంలో పొలంలో జారి పడి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం వెలుగు చూసింది. మండలంలోని పడమటి గూడెం శివారు బస్తారాం తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ సిరి(40) మూడు రోజుల క్రితం వివాహ వేడుకకు హాజరయ్యాడు. అనంతరం మద్యం తాగి పొలం వద్దకు వెళ్లాడు. ఇక్కడ గెట్టు ఒరం జారి పొలంలో పడి మృతి చెందాడు. ఇంతకు ముందు పలుమార్లు మద్యం తాగి 2,3 రోజుల అనంతరం ఇంటికి వచ్చేవాడు. ఇదే మాదిరి ఏదో ప్రాంతానికి వెళ్లాడని కుటుంబసభ్యులు భావించారు. ఈక్రమంలో ఆదివారం సాయింత్రం చుట్టుపక్కల రైతులకు దుర్వాసన రావడంతో చూశారు. సిరి మృతి చెంది కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఎస్సై రాజు, నర్సింహులపేట ఏఎస్సై కె.వెంకన్న ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వల్మిడి ఆలయంలో భక్తులకు గాయాలు



గాయపడిన చిన్నారి మనుశ్రీకి చికిత్స నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- గాలి దుమారంతో కూలిన టెంటు

పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో అప్రశుతి చోటు చేసుకుంది. ఒక్కసారిగా సుడి గాలి దుమారం రావడంతో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం వద్ద టెంట్లు కూలాయి. దీంతో భక్తులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. అక్కడే ఉన్న వల్మిడికి చెందిన వృద్ధురాలు వాసూరి మారమ్మ, చెన్నూరుకు చెందిన బాలిక మారేపల్లి మనుశ్రీ, గంట్లకుంటకు చెందిన సంధ్యారాణి గాయపడ్డారు. వారికి ఆలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ప్రథమ చికిత్స చేశారు.

మానుకోటలో సూర్యాపేట పోలీసుల విచారణ

మహబూబాబాద్ రూరల్: సూర్యాపేట జిల్లాలో జరిగిన ఓ హత్య కేసు విషయంలో అక్కడి పోలీసులు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి విచారణ చేపట్టారు. నిందితులు సూర్యాపేటలో హత్య చేసి, వారు వాడిన ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లను మహబూబాబాద్‌లో ఉంచి వెళ్లినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్ ఫోన్లను కొత్త కూరగాయల మార్కెట్ ఆవరణలో ఉంచి వెళ్లగా సూర్యాపేట పోలీసులు స్వాధీనం చేసుకుని తమ వెంట తీసుకెళ్లారు. హత్య కేసులో మహబూబాబాద్‌లోని ఓ మెడికల్ షాపు నిర్వాహకుడి బంధువు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం.

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్

దరఖాస్తుకు 19న చివరి తేదీ
- మే 13వ తేదీన ప్రవేశ పరీక్ష
- ఎస్సీ, ఎస్టీలకు ఫీజు రూ.250
- బీసీ, జనరల్ కేటగిరీలకు రూ.500
- పదో తరగతి విద్యార్థులకు సువర్ణావకాశం

దరఖాస్తు ఫీజు వివరాలు..

పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పాలిటెక్నిక్ ప్రవేశాలకుగాను ఆన్‌లైన్‌లో ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజు రూ.250 కాగా, బీసీ, జనరల్ కేటగిరీ విద్యార్థులకు రూ.500 ఫీజు చెల్లించాలి. ఆలస్య రుసుము రూ.100తో ఏప్రిల్ 22వ తేదీ వరకు, రూ.300 ఫీజుతో ఏప్రిల్ 23 వరకు గడువు కల్పించారు. డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్ష మే 13వ తేదీన నిర్వహించనున్నారు. Sbtet.telangana.govt.in వెబ్‌సైట్‌లో చూడొచ్చు.



మహబూబాబాద్ అర్బన్ : పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులకు సాంకేతిక విద్యా కోర్సుల్లో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు కల్పించేందుకు పాలిసెట్ ఎంట్రెన్స్ ప్రవేశాలకు రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ వ్యాప్తంగా వివిధ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం అందించే ఉద్యాన డిప్లొమా కోర్సులు, పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ కోర్సుల్లో, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాలిటెక్నిక్ విద్యా సంస్థల్లో అడ్మిషన్లను పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకుల ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు.

పది, ఆపై తరగతుల విద్యార్థులకు అవకాశం

పదో తరగతి పూర్తి కాగానే మూడేళ్ల డిప్లొమా కోర్సుతో జీవితంలో స్థిరపడొచ్చు. ఉద్యోగం వద్దనుకుంటే బీటెక్ సెకండియర్‌లో చేరి ఉన్నత విద్యనభ్యసించవచ్చు. బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే పాలిటెక్నిక్ విద్యార్థులకు సువర్ణావకాశమని విద్యావేత్తలు చెబుతున్నారు. సప్లిమెంటరీలో, ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చు. దీంతో ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

ఎంపిక మార్కులు ఇలా..

మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల అయ్యింది.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష 2:30 నిమిషాల వ్యవధి ఉంటుంది. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులతో పదోతరగతి సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఉంటాయి. ఈ పరీక్షను మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో గణితం -60, ఫిజిక్స్-30, బయాలజికల్-30, కెమిస్ట్రీ-30 మార్కుల చొప్పున ప్రశ్న పత్రం రూపొందిస్తారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి 1:30 గంటల వరకు ఉంటుంది. పాలిటెక్నిక్‌లో ఇంజనీరింగ్ కోర్సు చేసే విద్యార్థులు బయాలజికల్ తప్ప మిగిలిన సబ్జెక్టులు, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రవేశాల పరీక్షలు అంటెప్ట్ చేయాలి. అగ్రికల్చర్, వెటర్నరీ డిప్లొమా కోర్సులో అడ్మిషన్లకు పరీక్ష రాసే విద్యార్థులు బయాలజికల్ 30 మార్కులు ప్రశ్నలు రాయాల్సి ఉంటుంది. పాలిటెక్నిక్ అర్హత మార్కులు ఎస్‌బీటెట్ ద్వారా పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు 120 మార్కులలో 30 శాతం, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ కలిపి అంటే 36 మార్కులు, వ్యవసాయ పాలిటెక్నిక్, వెటర్నరీ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు 120 మార్కులలో 30 శాతం గణితం, బయాలజికల్, ఫిజిక్స్, కెమిస్ట్రీ కలిపి అంటే రెండు భాగాల్లో 36 మార్కులు తప్పనిసరిగా స్కోర్ చేస్తే సీటు సాధిస్తారు.

డిప్లొమాతో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు



పదో తరగతి పూర్తయిన విద్యార్థులు పాలిటెక్నిక్‌లో సీటు సాధించాలంటే ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. పది సిలబస్‌తోనే ప్రశ్నలు ఉంటాయి. కష్టపడి చదివితే సీటు వస్తుంది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు త్వరగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు సాధించొచ్చు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సులకు చాలా డిమాండ్ ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను పాలిటెక్నిక్ కోర్సులో చేర్పించి చదివిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుంది.

– బైరి ప్రభాకర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

ఫాతిమా హైస్కూల్‌లో స్పాట్ కేంద్రం
- 2,27,864 జవాబు పత్రాల రాక
- స్పాట్ విధులకు 957 మంది టీచర్లు
- సీనియారిటీ ప్రకారం 6 జిల్లాల వారికి విధులు
- గతేడాది రెమ్యునరేషన్ విడుదల



విద్యారణ్యపురి : పదోతరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం నేటినుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండలోని కాజీపేట ఫాతిమా హైస్కూల్‌లో జవాబుపత్రాల మూల్యాంకనం చేసేందుకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇక్కడికి తీసుకొచ్చిన పదోతరగతి జవాబు పత్రాల కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ ఆదివారం సాయంత్రం పూర్తయింది.

ఉమ్మడి జిల్లా నుంచి జవాబు పత్రాల రాక

ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల టెన్త్ స్పాట్ కేంద్రాన్ని హనుమకొండలో ఏర్పాటు చేశారు. టెన్త్ సబ్జెక్టు పరీక్షల జవాబు పత్రాలన్నీ కలిపి 2,27,864 ఈ కేంద్రానికి తీసుకొచ్చారు. ఈ స్పాట్ కేంద్రానికి క్యాంప్ ఆఫీసర్‌గా హనుమకొండ జిల్లా డీఈఓ డి.వాసంతి వ్యవహరిస్తున్నారు.

సీఈలు, ఏఈలు 741, స్పెషల్ అసిస్టెంట్లు 216 మంది..

పదో తరగతి మూల్యాంకనానికి ఆరు జిల్లాలోని ఆయా సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లకు, సీఈలుగా, ఏఈలు గాను టీచర్లకు సీనియారిటీ ప్రకారం నియామక ఉత్తర్వులు పంపారు. జవాబు పత్రాలు వాల్యుయేషన్ చేసే టీచర్లు కనీసం మూడేళ్లు ఆయా సబ్జెక్టులో విద్యాబోధన చేసి ఉండాల్సిందే. రోజుకు చీఫ్ ఎగ్జామినర్లుగా (సీఈ)లుగా 108 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా (ఏఈ)లుగా 633 మంది మొత్తం 741 మంది స్కూల్ అసిస్టెంట్లను నియమించారు. స్పెషల్ అసిస్టెంట్లుగా సెకండరీ గ్రేడ్ టీచర్లను (ఎస్‌జీటీ) 216 మందిని నియమించారు. మొత్తం 957మంది టీచర్లు స్పాట్ విధులు నిర్వహించనున్నారు.

నేడు ఉదయం రిపోర్టు చేయాలి..

కాజీపేటలోని టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఆయా టీచర్లు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. రోజుకు ఒక్కో టీచర్ 40 జవాబు పత్రాలు వాల్యుయేషన్ చేయాలి. రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు విధుల్లో ఉంటారు. స్పాట్ విధుల ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా విధుల్లో పాల్గొనాలని, గైర్హాజర్ టీచర్లపై చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

గతేడాది రెమ్యునరేషన్ విడుదల!

గతేడాది ఏప్రిల్‌లో టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ విధులు నిర్వర్తించిన టీచర్లకు ఇతర సిబ్బందికి రెమ్యునరేషన్ రూ.59 లక్షలకు పైగా ఇటీవలే జిల్లా విద్యాశాఖకు విడుదల అయ్యాయి. అయితే గతేడాది టెన్త్ స్పాట్ విధుల్లో పాల్గొన్న టీచర్లు, ఇతర సిబ్బంది మొత్తం 1,072 మందికి కూడా మూడ్రోజుల క్రితం వారి అకౌంట్లలోనికి రెమ్యూనరేషన్‌ను విడుదల చేశారని సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

రాములోరి కల్యాణంలో ఫ్లెక్సీల రగడ



కాశిబుగ్గ ఆలయం వద్ద మంత్రి ఫొటో లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

వరంగల్: శ్రీరామనవమిని పురస్కరించుకుని భక్తులకు ఆహ్వానం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై పలువురు ఆరోపణలు చేస్తున్నారు. కాశిబుగ్గలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో కల్యాణోత్సవానికి రూ.8.90 లక్షల నిధులను ప్రభుత్వం నుంచి మంత్రి కొండా సురేఖ మంజూరు చేయించారు. ఆదివారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో మంత్రి సురేఖ, స్థానిక కార్పొరేటర్‌తో పాటు అధికార పార్టీకి చెందిన నాయకుల ఫొటోలు పెట్టకపోవడం సరికాదని కాంగ్రెస్ కార్యకర్తలు అంటున్నారు. ఆలయంలో జరిగే కార్యక్రమాల్లో సైతం నాయకుల వర్గపోరు బయటపడింది. ప్రభుత్వ నుంచి నిధులు మంజూరైనప్పటికీ దాతల డబ్బులతోనే కల్యాణ ఏర్పాట్లు చేశారని తెలుస్తోంది.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ బుకీ అరెస్ట్

వరంగల్ క్రైం: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ బుకీని అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ పీఎస్ పరిధిలో ఇటీవల పట్టుకున్న క్రికెట్ బెట్టింగ్ ఏజెంట్లు హైదరాబాద్‌కు చెందిన చింతపండు కృష్ణ, మెడిశెట్టి నరేశ్‌తో పాటు ఆటగాళ్లు పులి ఓంకార్, పల్లపు సుకేశ్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 1.58 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. వారు క్రికెట్ బుకీ వివరాలు తెలపడంతో కాకినాడకు చెందిన గడ్డం వీరమణి కుమార్‌ను ఆదివారం అరెస్ట్ చేసి నిందితుడి నుంచి రూ. 1.50 లక్షల నగదు, 2 సెల్‌ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. హనుమకొండకు చెందిన మరో ఆటగాడు కితిరి రంజిత్, హైదరాబాద్‌కు చెందిన బుకీ యోగేశ్ గుప్తా పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.